


సాదాసీదా మనిషి.. అంతరంగాన సాహసి

.. 16లో



# సాదాసీదా మనిషి.. అంతరంగాన సాహసి

## మన కలెక్టర్ అశోక్‌కుమార్

న్యూస్‌టుడే, కడప

సాదాసీదా దుస్తులతో అతి సామాన్యంగా కనిపించే 1991 బ్యాచ్ ఐ.ఎ.ఎస్. అధికారి గోపాలపిళ్లై అశోక్‌కుమార్ ఒక సాహస క్రీడాకారుడు



రంగరాజన్ అభినందనలు..

కూడా.అంతేకాదు.. సాంఘిక దురాచారాలపై పోరాడిన వ్యక్తి. శతాబ్దాలుగా పాతుకుపోయిన జోగిని, పోతురాజు వ్యవస్థలను నిర్మూలించేందుకు కృషి చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలో 'బాల్యరక్ష' పాఠశాలలకు శ్రీకారం చుట్టారు. ఇతర అధికారులకు భిన్నంగా కారు ముందు సీటులో తాను కూర్చొని వెనక సీటులో తన సిబ్బందిని కూర్చోబెడతారు కడప కలెక్టర్ అశోక్‌కుమార్. ఏమంటే.. నా టీంను నేను ముందుండి నడిపిస్తాను అంటారు సరదాగా. తన 'జీవనశైలి'ని వివరిస్తూ 'న్యూస్‌టుడే'తో కలెక్టరు అనుభూతులను ఇలా పంచుకొన్నారు..

### వ్యక్తిగతం..

**కుటుంబం :** అశోక్‌కుమార్ జన్మించింది కేరళ రాష్ట్రంలో 1964 ఫిబ్రవరి 7వ తేదీన. తండ్రి గోపాలపిళ్లై, తల్లి రాజమ్మ, ఒక సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. భార్య డాక్టర్ బిందు, తనయుడు గౌరవ్.

**చదువు - ఉద్యోగం :** బి.టెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్), హిందీ భూషణ్‌లో బంగారు పతకం. ఎస్సెస్సీలో రాష్ట్ర 10వ ర్యాంకు. టి.ఐ.ఎఫ్.ఆర్. (టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్/ ముంబాయి)లో రీసెర్చి స్కాలర్. బెంగుళూరు సి-డాట్‌లో డిజైన్ ఇంజినీరు. ఇక ఐ.ఎ.ఎస్.కు ఎంపికయ్యాక ఉట్నూరు సబ్-కలెక్టర్, భద్రాచలంలో ఐ.టి.డి.ఎ. పి.ఒ., ఐ.టి. శాఖ డిప్యూటీ సెక్రటరీ, చిత్తూరు జేసీ, జాయింట్ ఎలక్షన్ ఆఫీసర్, నిజామాబాద్ కలెక్టర్, శాప్ ఎం.డి., హుడా వైస్‌ఛైర్మన్, ప్రస్తుతం కడప కలెక్టర్.

### మనోగతం..

'మహాత్మాగాంధీ తీవ్రంగా ప్రభావితం




చేశారు. ఆయన ఆత్మకథ మార్గదర్శకం అయింది. 'సింప్లిసిటీ' ఎంతో నచ్చుతుంది. అదే ఆచరిస్తా. చెప్పిన మాట చేయడం, సమయాన్ని పాటించడం, అబద్ధం చెప్పకపోవడం.. ఇప్పటికీ పాటిస్తున్న నియమాలు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించడం, ముఖంపై నవ్వు చెదరనీయకపోవడం, శత్రువైనా సాయం చేయాలనుకోవడం.. బలంగా ఆచరిస్తాను. ఇక.. అందరినీ నమ్మడం, ఒత్తిడిని అతిగా భరించడం బలహీనతలనే చెప్పాలి. ఎదుటివారు సూటిగా మాట్లాడితేనే నయం. మంచి తెలుపు, నీలి రంగులంటే ఎంతో ఇష్టం. ప్రతీరోజూ కనీసం మూడు నిమిషాలైనా దేవునికి పూజ చేయాల్సిందే'.

### అధికారిగా సంతృప్తి..

'భద్రాచలం ఐ.టి.డి.ఎ. పీవోగా కొండరెడ్లకు శాశ్వత నివాసప్రాంతం ఏర్పాటుచేయడం, నిజామాబాద్‌లో వందల ఏళ్లుగా కొనసాగిన పోతురాజు, జోగిని దురాచారాలను అడ్డుకోవడం, అదే జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను 11 మండలాల్లో లేకుండా చేయడం అధికారిగా మరిచిపోలేని అనుభూతి మిగిల్చిన జ్ఞాపకాలు. క్రీడాకారుడిని అయినందున 'శాప్' ఎం.డి.గా మొదటి ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌ను నిర్వహించడం, సానియా మీర్జా వంటి టెన్నిస్ క్రీడాకారిణికి అండగా నిలవడం సంతోషాన్ని ఇస్తాయి.'

### దోశ, పెసరపప్పు..

'సాదాగా గడపడం, దోశ, పెసరపప్పు, గంజి తాగడం ఎంతో ఇష్టం.కర్ణాటక



క్రికెట్ దిగ్గజం సునీల్‌గవాస్కర్‌తో..

సంగీతం, పాత హిందీ పాటలు మనసుకు హాయినిచ్చే అంశాలు. టేబుల్ టెన్నిస్‌లో యూనివర్సిటీ ఛాంపియన్ అయినా, ఇపుడు అలవాటు తప్పింది.'

### హిమగిరుల్లో సాహసం

కొసమెరుపు ఏమిటంటే.. సాహసక్రీడల్లో ట్రెక్కింగ్, మౌంటెనీరింగ్ చేసిన కలెక్టర్ అశోక్‌కుమార్ హిమాలయాల్లో 21,000 అడుగుల వరకూ అధిరోహించారు. గుర్రపు స్వారీ, సైక్లింగ్ ఇష్టంగా చేసే ఈయన తొమ్మిది భాషల్లో మాట్లాడగలరు.



ఉల్లాసంగా కుటుంబసభ్యులతో అశోక్‌కుమార్